# శ్రేయోభిలాషి

'కౌశికన్'

డేవిడ్ స్కూటరు ఆపి- స్టాండువేసి- సత్యనారాయణస్వామివారి దేవాలయంలో పార్కుచేసి- వాచ్‌మాన్‌ని చూస్తూండమని చెప్పాడు. మేము మెట్లు దిగి కృష్ణానది ఒడ్డున ఒక మంచిచోటు ఎన్నుకొని- జేబురుమాళ్ళు పరచుకొని కూర్చున్నాం.



కొంచెం దూరాన- నాగార్జునసాగర్ బ్రిడ్జిపైన ఉన్న లైట్లు తోరణాల్లా వ్రేలాడుతూ- వరుసలు వరుసలుగా- నల్లని ఆకాశంలో తెల్లటి చుక్కల్లా మెరిసిపోతున్నాయ్.

-ప్రకృతి ప్రశాంతంగా- అహ్లాదకరంగా ఉంది.

-సంధ్యాసమయమయింది. చీకటి పడ్డానికి అట్టే సమయంలేదు. పశ్చిమాద్రి పై సూర్యుడు నారింజరంగు కిరణాలతో దాగుడుమూతలాడుతున్నాడు.

సరిగ్గా దాదాపు అదే సమయానికి- నేనూ- డేవిడ్- రోజూ కృష్ణానది ఒడ్డుకి షికారుకొస్తుంటాము.

మే మిద్దరం ఉద్యోగరీత్యా నాగార్జునసాగర్ బదిలీ ఐనప్పటినుంచి చేస్తూన్న దినచర్యే ఇది.

డేవిడు-నేనూ ప్రాణ స్నేహితులం.

అతను క్రిష్టియన్– నేను హిందువును.

అయన తన మతం అన్నిటికంటే గొప్పదని విశ్వసిస్తాడు. నేనూ అంతే.

కాని మా ఇద్దరి ప్రాణస్నేహానికి– కులాలుగాని, మతాలుగాని, ఆఫీసులో మా హోదాలుగాని ఎప్పుడూ అడ్డుగోడలుగా నిల్వలేదు.

మా స్నేహాన్ని చూసి కొందరు ముచ్చటపడితే– మా ఆఫీసులో మరి కొందరు అసూయపడతారు. మరి కొందరు ఎద్దేవా చేస్తారు.

మేము ఎదురుగా లేనప్పుడు మా గురించి అవాకులు– చెవాకులూ వాగుతుంటారు.

అయినా వాళ్ళందరితో మాకు పని లేదు.

మా స్నేహంమాత్రం గత దశాబ్దంగా నిరాటంకంగా సాగిపోతూనే ఉన్నది.

సర్దుకొని కూర్చున్నాక– అంతసేపూ కులాసా కబుర్లు చెబుతున్నవాడల్లా సడెన్‌గా సీరియస్సైపోయాడు.

నదిలోని నీళ్ళల్లోకి చిన్న చిన్న రాళ్ళను విసురుతూ– వాటివంకే చూస్తూ "నీతో చాలారోజులుగా ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలనుకుంటున్నానోయ్" అన్నాడు.

వాడలా సీరియస్సైపోయి, సీరియస్సైన విషయమన్నాడంటే– దానివెనక పెద్ద గ్రంథమేదో ఉండి ఉంటుంది.

ఏదైనా ఒక ముఖ్యమైన విషయం గురించి మాట్లాడాల్సొచ్చినప్పుడు మాత్రమే అతని హావభావాలలా మారడం నాకు తెలుసు.

"ఏమిటి విషయం" అన్నాను అతనిలోని సీరియస్‌నెస్‌ని తగ్గించి మామూలైన జోవియల్ మూడ్‌లో పెడదామని.

కాని అతను మాత్రం ఏమాత్రం చలించకుండా– "నీవు అనవసరంగా జోకులు వేయక నేను చెప్పింది విని సలహా చెప్తానంటేనే చెబుతాగాని– లేకపోతే ఆ విషయం నీ దగ్గర ఎత్తను" అన్నాడు.

"అసలు విషయం చెప్పకుండా ఏమిటోయ్ నీ వెధవ సీరియస్‌నెస్" అన్నాను.

"నేను ఒక మంచి ఉద్యోగం చేసే అమ్మాయిని చూసుకొని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నానోయ్" అన్నాడు.

"గుడ్ జోక్– వెరీగుడ్ జోక్" అని నవ్వాను.

"జోకు కాదు! నిజంగానే– నేను సీరియస్‌గా చెబుతున్నాను. నీవు నా సమస్య విని సరియైన సలహా ఇస్తానంటే నేమో చెబుతాను. లేకపోతే నీ దగ్గర ఆ ప్రసక్తే తేను. వెళదాం పద" అని లేవబోయాడు.

"వింటానుగాని టైం వేస్టుచేయక అసలు విషయానికి రా" అన్నాను అసహనంగా.

"మా అవిడ నాకంటే పదేళ్లు పెద్ద.

ఆ విషయం నీకు తెలుసుగా. ఆవిడ దగ్గర నాకు బొత్తిగా సుఖంలేకుండా పోయింది" అన్నాడు.

"అవును! అది ఇప్పుడు కొత్త విషయమేమీ కాదుగా! పాత కథే!" అన్నాను నేను విషయాన్ని తేల్చివేస్తూ.

"ఈ మధ్య నాకు—మా ఆవిడకూ ఏమాత్రం పొంతన కుదరడంలేదోయ్. నేను ఎవరితోనైనా ఆడపిల్లలతో మాట్లాడుతూంటే—నావైపు అనుమానంగా చూస్తూంది. ఇంటికెవరైనా స్నేహితులు, ముఖ్యంగా ఆడపిల్లలు వస్తే వాళ్లు వెళ్ళిందాకా నన్నోకంట కనిపెడుతూ ఉంటుంది" అన్నాడు డేవిడ్.

"అవునూ. అది ప్రతి భార్యా చేసే పనే— అందులో వింతేమీ లేదు. ప్రతి భార్యా తన భర్త పరాధీనం కాకూడదనే అడుగడుగునా జాగ్రత్త పడుతూంది. నన్నడిగితే పదాలిగూడాను."

"ఒరేయ్, ఇదివరకు నా భార్య అలా ఉండేదికాదురా! ఎవరైనా ఆడవాళ్ళు వస్తే అరమరిక లేకుండా తిరిగేది. వాళ్ళను ఇళ్ళదగ్గర నా స్కూటర్‌మీదే డ్రాప్‌చేయమని పురమాయించేదికూడా! అలాంటి సందర్భాల్లో నేనే వెనకాడే వాడ్ని!

"మరిప్పుడింత కాలానికి మీ ఆవిడలో అకస్మాత్తుగా ఈ మార్పు ఎందుకొచ్చిందంటావ్?"

"అదే తెలియటంలేదురా! నేను ఆవిడకంటే వయస్సులో చిన్నవాణ్ణని— కాబట్టే కావాలనే ఆడపిల్లల్ని దగ్గరకు చేరదీస్తున్నానని— వాళ్ళను ఆకట్టుకోవాలనే బుద్ధిపూర్వకంగా ఈ సోషల్ గాదరింగ్సు కావాలనే నేను కల్పిస్తున్నానని— నామీద ఆవిడకోరకమైన అనుమాన పిశాచం బయలుదేరిందిరా! అందుకే ఆవిడ నన్నిలా అడుగడుగునా అనుమానించడం."

"ఇది కూడా ఒక పెద్ద సమస్యేనేమిటి? మీ ఇంటికి ఆడపిల్లలొచ్చినప్పుడు నీవు మరి కాస్త జాగ్రత్త వహిస్తే సరి" సలహా ఇవ్వబోయాను.

"అదికాదురా! ఆవిడ అనుమానం పూర్తిగా అబద్ధం కాదు! నాకు పట్టుమని ముప్పైఐదు లేవు. ఆవిడేమో అప్పుడే నలభై ఐదు దాటింది. నాలో ఇంకా కోరికలు చిగురిస్తూనే ఉన్నాయి. ఆవిడలో నేమో జవసత్వాలు నిదురిస్తున్నాయ్. అంచేత మా దాంపత్య జీవితంలో ఈ తేడా వచ్చిఉంటుంది!" అన్నాడు నీళ్ళవైపే చూస్తూ— రాళ్ళు విసరడం ఆపకుండా!

"అయినా— పెళ్ళిచేసుకొని ఆవిడతో ఓ పుష్కరం కాపురంచేసి— ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల పుట్టింతరువాత ఇప్పుడు నీకీ పాడుబుద్ధు లేమిట్రా— ఊరుకో— ఎవరైనా వింటే నవ్విపోతారు!" అన్నాను.

"నవ్వడాని కిందులో ఏముందిరా! నా

మొదటి భార్యను, పిల్లల్ని నడివీధిలో వదిలేస్తా ననడంలేదుగా! మా ఆవిడ ఇప్పుడు వెయ్యి రూపాయలకు పైగా సంపాదిస్తున్నది. పైగా- నేనుకూడా వాళ్ళతోటే ఉంటాను. ఎటొచ్చీ నేననే దేమిటంటే- ఓ ఉద్యోగం చేసే అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే- ఇంత చిన్నవయస్సులో నా కోరికల నణగార్చు కోవలసిన పనిలేదు. చెడుమార్గాల ననుస రించి కొంతమంది ఆడపిల్లల జీవితాలు నాశనంచేసి అవినీతిగా జీవించేదాని కన్నా- శాస్త్రప్రకారం మరో అమ్మాయిని నాకు నచ్చిన అమ్మాయిని పెళ్ళి చేసు కొని- ఇటు నా కోరికలు తీర్చుకుంటూ మొదటి భార్యాపిల్లలతోకూడా సంబం ధాలు త్రెంచుకోకుండా కలిసిమెలిసి ఉందామనుకుంటున్నాను. ఇది చూడ్డానికి నీలాంటివాళ్ళందరికీ నిష్టూరంగా కన్పించవచ్చు. అయితే యధార్థం మాత్రం ఇదే!"

"అసలు నీవు మొదట్లోనే తప్పు చేశావురా! నీకంటే ఎక్కువ వయసున్న ఆవిడను నీవు పెళ్ళి చేసుకోవడమెందుకు చెప్పు" అన్నాను.

"ఇప్పుడు మా ఆవిడ ఉందా"

"ఆఁ. అవును- ఉంది."

"ఆవిడ చెల్లెలు, నేను పదిహేనేళ్ళ క్రింద ప్రేమించుకొన్నాం. అందరిలాగే మేమూ కాలేజీలో- సినిమాహాళ్ళలో కలుసుకున్నాం. కథలు చెప్పుకున్నాం- కబుర్లు చెప్పుకొన్నాం- తోటల్లో దొడ్లల్లో చెట్టపట్టాలేసుకొని తిరిగాం."

"అలాంటప్పుడు మీ రిద్దరూ ధైర్యంగా పెళ్లి చేసుకోవల్సిందిగా"

"కాని మా ప్రేమకు పరిస్థితు లనుకూ లించలేదు. మా చిన్నావిడ సోదరులు రాక్షసుల్లాంటివారు. మా ప్రేమ వ్యవహా రాన్ని పసిగట్టారు. అప్పటికింకా నేను బి. య్యే. చదువుతున్నాను. నాకు వెనక పెద్ద ఆస్తిపాస్తులుగాని- ఉద్యోగంకాని లేదు. ఈ పిల్లను నేను పెళ్లిచేసుకొని అటు ఉద్యోగంలేక-ఇటు ఈ అమ్మాయిని సాకలేక ఆ పిల్ల జీవితం నడివీధుల పాలు చేస్తాననుకొని- ఓ రోజు రాత్రికి రాత్రి పదిమంది గూండాలను తీసుకొచ్చి ఆ అమ్మాయి తాలూకువాళ్లు బలవంతాన లాక్కెళ్ళి మరెవరో తలమాసినవాడి కిచ్చి పెళ్లిచేశారు.

"ఆ తరువాత ఏమైంది?" అడిగాను ఏదో కథ వింటున్నట్లుగా.

"ఆ అమ్మాయి ఆ తర్వాత నన్ను కలుసుకోవాలని ఎంతో ప్రయత్నిం చింది. కాని వాళ్లు సాగనివ్వలేదు." 'నీవు అతని దగ్గరికెళితే ముందు అతన్ని చంపి- ఆ తర్వాత నిన్ను చంపుతానని' బెదిరించారట. ఆనాటినుండి ఆమె నామీద అన్ని ఆశలు వదలుకొంది. ఆత్మను చంపుకొని- ప్రేమను బుగ్గిపాలుచేసి- కేవలం తన కట్టెతో కాపురం చేస్తున్నా నని నాకు తెలియచేసింది. తరువాత



ఎవరో చెప్పారు, ఆ అమ్మాయి కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకొని- చావలేక బ్రతకలేక- జీవితాన్ని ఈడుస్తున్నానని."

"అలాగా!" అన్నాను నిర్లిప్తంగా. "సరే! జరిగిందంతా ఓ పీడకలగా మర్చిపో! ఇప్పుడున్న భార్యాపిల్లల్తో తృప్తిపడి చక్కగా కాపురం చేసుకో- పిచ్చిపిచ్చి ఆలోచనలు రానీయక" అన్నాను.

"అదికాదు బ్రదర్! నీవు నా బాధ అర్థంచేసుకోలేదు. ఇప్పటికి నా ఈ భార్య చెడ్డదని నే ననడంలేదు. నిజం చెప్పాలంటే ఆవిడ కంటే మంచిది."

"నెలకు నాల్గంకెల జీతాన్ని సంపాదిస్తూంది. నా మీదే ప్రాణాలు నిల్పుకొని ఉంటూంది. ఎప్పుడూ నా మాటకు ఎదురుచెప్పదు. తన ఉద్యోగమేమిటో- తానేమిటో-నా కెలాంటి లోటురానివ్వదు. కాని___" అని ఇంకా ఏదో చెప్పడానికి నాందిగా ఒక్క నిమిషం ఆగాడు.

"ఏమిటి కాని___ కాణీలేదు అర్ధణా లేదు గాని ___ ఇక క్లోజ్‌చేయి టాపిక్" అన్నాను. నా ఫ్రెండు పండంటి కాపురం ఎక్కడ చెడిపోతుందో అన్న భయం నాలో లేకపోలేదు.

"అన్నీ ఉన్నా మా ఆవిడ నా హావభావాలుగుర్తించి మసలుకోదురా" అన్నాడు కొత్త టాపికేదో ప్రారంభిస్తున్నట్లుగా

"మళ్ళీ ఏమిట్రా అలా ఆముదం త్రాగిన ముఖంలా పెట్టావ్?"

"మా దాంపత్య జీవితంలో అడపా దడపా వచ్చే కొన్ని చిటపటల గురించి చెబుతాను."

"కానియ్ తప్పుతూందామరి" అన్నాను

"వంట చాలా రుచిగా చేస్తుంది. కాని వడ్డించే ఓపిక మాత్రం ఉండదు. అదే మా చిన్నావిడైతేనా- వంట అంత బాగా రాకపోయినా- వండింది మాత్రం- దగ్గ రుండి కొసరి కొసరి వడ్డించి- దాదాపు నోట్లో పెట్టి తిన్పించినట్లు చేసేది. వంట ఎంత బాగా చేస్తే ఎవరిక్కావాలి భార్యాభర్తల మధ్య ఉండాల్సిన అ సున్నితమైన రాగబంధం లేకపోయిం తర్వాత?"

"అలాగే-

నేనెక్కడికైనా బయటికెళ్ళొస్తే — నాకెదురొచ్చి కాళ్ళు ముఖం కడుక్కోవ టానికి నీళ్ల పెట్టి- భోజనం చేసి పడుకునే దాకా ఆవిడ కాన్సంట్రేషను నా మీదే ఉండేది.

"ఈవిడలా కాదు. ఇంట్లో అన్నీ ఉంటాయి. కాని నేను ఆఫీసునుంచి వచ్చేసరికి - పక్కింటి పిన్నిగారితో మాట్లాడుతూనో - పై ఇంటివాళ్ళతో బజారుకెడుతూనో ఉండి- నా ఉనికి నే మాత్రం పట్టించుకోకుండా నేను ఆఫీసు నుంచి వచ్చింతరువాత ఓ గంటగ్గాని కన్పించదు. దాంతో నాకు చిర్రెత్తిపోయి ఈవిడకు నేనంటే ప్రేమానురాగాలు లేవు. నా కంటేపక్కింటివాళ్ళు-పైఇంటి వాళ్ళే ముఖ్యమా అనుకొనేవాణ్ణి."

"అంతేనా! నీ బాధకు ఇంకేమైనా సాక్ష్యాధారాలు ఉన్నాయా" అన్నాను, కోర్టులో సాక్షిని క్రాసెగ్జామినేషను చేస్తున్న లాయరులా పోజు పెట్టి.

"చెప్పాలంటే ఇంకా ఎన్నో ఉన్నాయ్. ఒకరోజు నేను స్కూటరు మీద - విపరీతమైన వర్షంలో తడిసి వచ్చాను. స్కూటర్ గారేజీలో పెట్టి — తడిసి ముద్దయిన బట్టలతో - తల్లోనించి నీళ్ళుకారుతూ ఇంట్లోకి వచ్చాను. మా ఆవిడ తలపుతీసింది అతి కష్టంగా- తలపు తీసిన మనిషి ఏదైనా టవలు ఇవ్వడం కాని నాకేంకావాలి అని చూడ్డం కాని లేదు.

మళ్ళీ పక్కింటికెళ్ళి- వాళ్ళతో కబు ర్లలో పడ్డది.

అప్పుడు నేను టవలు వెదుక్కొని- తల, వళ్ళు తుడుచుకొని- లుంగీ మార్చు కొని- పదినిమిషాలు పడుకున్నదాకా- మా ఆవిడ పక్కింటివాళ్ళతో లోకాభి రామాయణం ముగియలేదు. నాకప్పుడని పించింది.

అదే మా చిన్నావిడైతేనా? - తనే నాకు టవలు తెచ్చి- స్వయంగా నా వళ్ళు- తలా తుడిచి- కడుపునిండా వేడి వేడి అన్నంపెట్టి- పక్కవేసి- తన కౌగిటితో కాపేది అనుకున్నాను. మా చిన్నావిడ

జ్ఞాపకంరాగానే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగినంత పనైంది."

దేవిడ్ దీర్ఘమైన స్వగతంలాంటి ఉపన్యాసం విన్నతరువాత ఎక్కడో అక్కడ బ్రేకువేయాలనిపించి- "దీన్నిబట్టి- మీ ఆవిడ ఎప్పుడూ నీకు చాకిరీ చేస్తూ - ఇరుగూపొరుగూ - అంటూ లేకుండా ఉండాలని నీ అభిప్రాయమా ?" అన్నాను.

దానికి దేవిడ్ "నా అభిప్రాయం అది కాదు. భార్యా-భర్తల మధ్య ఉండవలసిన ఆ అప్యాయత- అనురాగం- అనుబంధం- ఆకర్షణ-మా ఆవిడలో లేవేమో అన్పించి నాకు మా ప్రేమసామ్రాజ్యం ఒక పెద్ద ప్రశ్నార్థకంగా - శూన్యంలా గోచరిస్తూంది.

మా పెద్దావిడలో నాకు- గంభీరత- పెద్దరికం, నిండుదనం- కన్పిస్తే-

మా చిన్నావిడలో - ఆప్యాయత - అనురాగం- అనుబంధం- అన్యోన్యం- ఉత్కంఠ- ఉద్వేగం- ఎప్పుడూ నన్నల్లుకు పోవాలనే ఆకాంక్ష- ప్రతిక్షణమూ నాతోటే గడపాలనే తీవ్రమైన కోరిక కన్పించేవి-

మా పెద్దావిడ- నా శ్రేయోభిలాషిలా- మంచి స్నేహితురాలిలా కన్పిస్తే-

మా చిన్నావిడ ప్రియురాలు- జవ్వని- ప్రేమ పరవళ్ళుతొక్కే సెలయేరులా కన్పిస్తూంది.

అంచేతేనోయ్ నేననేది. నేను బ్రతికినంతకాలం జీవితంతో రాజీపడి - కోర్కెలు చంపుకొని - వేదాంతిలా బ్రతకలేను. భవిష్యత్తులో జీవించే కొద్దికాలమైనా- నేనంటే ప్రాణప్రదంగా చూసుకునే మరో అమ్మాయిని ఎన్నుకొని- శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని ఉంది."

"అప్పుడు నీ భార్యాపిల్ల లేమౌతారు?" అన్నాను నేను.

"ఏమీ కారు- వాళ్ళు ఆర్థికంగా- సాంఘికంగా ఎలాంటి కష్టాల నెదుర్కోకుండా చూసుకుంటానని నేను నీకు వాగ్దానం చేస్తున్నాను." అన్నాడు.

"ఎంచేతో నీ అభిప్రాయాల్తో నే నేకీభవించలేకపోతున్నానురా! ఇది అంత తేలికైన సమస్యేమీ కాదు. బాగా ఆలోచించిన మీదటే ఒక నిర్ణయానికి రావలసి ఉంది. తొందరపడి అప్పుడే ఏ నిర్ణయానికి రాకు" అన్నాను.

"బాగా చీకటిపడింది. ఇక వెళదామా" అని లేచాడు దేవిడ్.

ఇద్దరం లేచిమెట్లెక్కి - దేవాలయంలో కెళ్ళి- స్కూటరు స్టార్టుచేసుకొని- నన్ను మా ఇంటిదగ్గర డ్రాప్‌చేసి అతను వెళ్ళిపోయాడు.

ఆ తరువాత- ఎప్పుడూలేంది- వారం రోజుల్దాకా- దేవిడ్ కన్పించలేదు.

ఒకరోజు నేను ఆఫీసులో పనిచేసుకుంటూఉండగా ఓ కవరు వచ్చింది. విప్పి చూశాను.

సందేహం లేదు. రైటింగ్ దేవిడ్‌దే. అందులో ఇలా ఉంది.

"డియర్ మల్లిక్!

నిన్ను కలిసిన మరునటిరోజే నా మనసులో ఉన్న అభిప్రాయాలన్నీ ఎలాంటి అరమరికలూ- దాపరికాలూ లేకుండా- నీకు చెప్పినట్లే మా ఆవిడతో చెప్పాను మే మిద్దరం ఆవేశపడకుండా విషయాలన్నీ చర్చించుకొన్నాం. చివరకు మా ఆవిడ నా అభిప్రాయాల్తో ఏకీభవిం చింది.

చాటుమాటుగా వ్యవహారాలు నడిపి- కన్నెపిల్లల్ని గర్భవతుల్ని చేసి- వారిని రోడ్డుమీద వదిలేసేదానికన్నా- ధైర్యంగా- నాకు నచ్చిన అమ్మాయిని ఎంచుకొని- పెళ్ళిచేసుకోవడమే మంచిది. దానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదంది.

కాని తనను- పిల్లల్ని మాత్రం ఎప్పుడూకుటుంబసభ్యులుగా గుర్తుంచుకో మంది. తన శేషజీవితాన్ని చర్చి సర్వీసులో గడపాలని తనకున్నట్లు చెప్పింది.

మాపెళ్ళిఆవిడేదగ్గరుండిజరిపించింది.

ఇప్పటి మా ఆవిడలో నేను కోరు కొన్నవన్నీ లభిస్తున్నాయి. ఈవిడ నాకు ప్రియురాలిగా కన్పిస్తూంటే- ఆవిడ నాకు ఒక మంచి స్నేహితురాలిలా- శ్రేయోభి లాషిలా కన్పిస్తున్నది.

మే మిద్దరం వేరే కాపురం పెట్టాం.

పిల్లలు మా కొత్తావిడ్ని పిన్నీ పిన్నీ- అని పిలుస్తూ- బాగా అలవాటైపోయారు.

ఒకసారి తీరిక చూచుకొని- మా కొత్తావిడను నీకూ- మీ ఆవిడకూ పరిచయం చేస్తాను.

త్వరలో నిన్ను కలుసుకోవడానికి ప్రయత్నిస్తా-

ఇట్లు
నీ ప్రియమిత్రుడు.

ఉత్తరం చదివి పక్కన పెట్టి- "వీడన్నంత పనిచేశాడు" అనుకున్నాను. అయినా భర్తల హావభావాల గుర్తెరిగి నడుచుకొని భార్యలు- భార్యల మనోభావాలు గుర్తెరిగి ప్రవర్తించని భర్తలు- ఇలాంటి దాంపత్యాలు- ఈ ఆధునిక యుగంలో ఎక్కువకాలం నిల్వవేమో- అని నాలో నేనే గొణుక్కు న్నాను.

